ట్రాఫిక్ సమస్యకు చెక్..

రైల్వేస్టేషన్ రోడ్డు విస్తరణ పనులు షురూ

- దుకాణాదారులకు ప్రత్యామ్నాయంగా భవన నిర్మాణం
- తొలగింపునకు ముందుకొచ్చిన యజమానులు

ఖమ్మంమయూరిసెంటర్: పాతికేళ్లుగాఖమ్మం రైల్వే స్టేషన్ నుంచి పాత మున్సిపాలిటీ రోడ్డు వరకు ట్రాఫిక్ విపరీతంగా పెరిగింది. ఈ ప్రాంతంలోనే రైల్వేస్టేషన్, వివిధ రకాల దుకాణాలు ఉండటంతో రద్దీగా ఉండి వాహనదారులు, పాదాచారులు తీవ్ర ఇక్కట్లకు గురవుతున్నారు. ఈ ఇబ్బందులను గుర్తించిన ప్రభుత్వం రైల్వేస్టేషన్ ప్రాంతం నుంచి పాత మున్సిపాలిటీ కార్యాలయం వరకు రోడ్డు వెడల్పు చేసేందుకు సిద్ధమైంది. ఇప్పుడు 30 అడుగులుగా ఉన్న రోడ్డును 60 అడుగులకు విస్తరించనుండడంతో ట్రాఫిక్ సమస్యకు పరిష్కారం లభించనుంది. ఇదే సమయాన రోడ్డు వెడల్పుతో ఉపాధి కోల్పోయే దుకాణ యజమానులకు ప్రత్యామ్నాయం చూపనున్నారు.

నిత్యం అదే రద్దీ..

నగరంలో రైల్వేస్టేషన్ రోడ్డు నుంచి పాత మున్సిపాలిటీ కార్యాలయం వరకు నిత్యం విపరీతమైన రద్దీ ఉంటుంది. ఈ ప్రాంతంలోనే ప్రధానమైన దుకాణాలు ఉండటం, రైల్వేస్టేషన్‌కు వెళ్లే దారి ఇదే కావడం, కమాన్‌బజార్ వైపు వచ్చే వెళ్లే వాహనాలు ఈ మార్గంలోనే వస్తుండటం, రైల్వేస్టేషన్ నుంచి పాత బస్టాండ్‌కు వెళ్లే మార్గం కూడా ఇదే కావడంతో జనసంచారంతోపాటు వాహనాల రాకపోకలు అధికంగా ఉంటాయి. ఈ రోడ్డు కేవలం 30 అడుగుల వెడల్పు ఉండటంతో ఇక్కడ ఉండే ట్రాఫిక్‌కు ఈ రోడ్డు ఏ మాత్రం సరిపోవడం లేదు. రైళ్లు వచ్చిన సమయంలో, ఈ ప్రాంతంలో ఉన్న సినిమా హాల్స్ వదిలినప్పుడు ట్రాఫిక్‌కు అంతరాయం ఏర్పడుతోంది. ఇక ఇదంతా ఒక ఎత్తయితే స్టేషన్ నుంచి బయటకు రాగానే ఆనంద్‌విహార్ హోటల్ నుంచి శ్రీనివాస థియేటర్ వరకు రోడ్డు వెంట ఆటోవాలాల హడావుడి ఎక్కువగా ఉంటోంది.



వెడల్పు చేయనున్న రైల్వేస్టేషన్ రోడ్డు

పనులు మొదలు



బోర్డులను తొలగిస్తున్న దృశ్యం

పాత మున్సిపల్ కార్యాలయం నుంచి రైల్వే స్టేషన్ వరకు రోడ్డు విస్తరించేందుకు కేఎంసీ అధికారులు పనులు చేపట్టారు. తొలుత రోడ్డు వెంట ఉన్న భవనాల తొలగింపునకు మార్కింగ్ పెట్టారు. అక్కడ ఉన్న వ్యాపారులు, భవన యజమానులు స్వచ్ఛందంగా ముందుకు రావడంతో అధికారులు మార్కింగ్ ఏర్పాటు చేసి పనులు ప్రారంభించారు. షాదీఖానా గోడను తొలగించగా.. ప్రైవేట్ భవనాలకు సంబంధించిన బోర్డులను, ఇతర సామాన్లను యజమానులే స్వచ్ఛందంగా తీసుకుంటున్నారు. వీటిని తీసిన తర్వాత అడ్డు వచ్చే గోడలను తొలగించనున్నారు. ఇక ఈ ప్రాంతంలో ఉన్న మున్సిపాలిటీకి సంబంధించిన భవనాలను తొలగించనున్నారు.

రోడ్డుకిరువైపులా వ్యాపారాలు

అసలే చిన్నరోడ్డు, మరోవైపు రద్దీ ప్రాంతం కావడంతో రోడ్డుకు ఇరువైపులా తోపుడుబండ్లతో వ్యాపారాలు నిర్వహిస్తుంటారు. దీంతో ఇటువైపుగా వెళ్లే పాదచారులు వాహనాల నుంచి తప్పుకోడానికి కూడా అవస్థలు పడాల్సి వస్తోంది. ఇక ఈ ప్రాంతంలో పనులు నిమిత్తం వచ్చిన వాహనదారులు తమ వాహనాలను రోడ్డుపక్కనే పార్కింగ్ చేస్తున్నారు. దీంతో మరింతగా ట్రాపిక్ సమస్య తలెత్తుతోంది. ఇక రోడ్డుకు ఇరువైపులా రెడీమేడ్, వస్త్రదుకాణాలు, సెల్‌షాపులు, గడియారం షాపులు ఉండటంతో ఎప్పుడు ఈ రోడ్డు హడావుడిగా ఉంటుంది.

వ్యాపారుల కోసం కాంప్లెక్స్

రైల్వేస్టేషన్ రోడ్డులో మున్సిపాలిటీ అద్దె భవనాల్లో ఉండి వ్యాపారాలు చేసుకుంటున్న వారి కోసం కేఎంసీ ఆధ్వర్యంలో దుకాణ సముదాయాన్ని నిర్మించేందుకు సన్నాహాలు చేస్తున్నారు. ఇప్పటికే కలెక్టర్ ముజమ్మిల్‌ఖాన్ సూచనలతో రైల్వేస్టేషన్ రోడ్డులో ఉన్న ప్రభుత్వ పాఠశాల ఆవరణలో రోడ్డు పక్కన ఉన్న ఖాళీ స్థలంలో సముదాయాన్ని నిర్మించేందుకు అధికారులు ప్రతిపాదనలు సిద్ధం చేశారు. 33 దుకాణాలను రోడ్డు విస్తరణ పనుల సందర్భంగా ఖాళీ చేయిస్తుండటంతో వారికి ఈ సముదాయంలో వ్యాపారాలు చేసుకునేందుకు దుకాణాలు కేటాయించనున్నారు. రూ.1.05 కోట్లతో 45 దుకాణాలు వచ్చేలా భవనాన్ని నిర్మించేందుకు ప్రతిపాదనల్లో పేర్కొన్నారు.

క్లుప్తంగా

అంగన్‌వాడీ కేంద్రంలో వస్తువుల పంపిణీ



సామగ్రి అందజేస్తున్న దాతలు

రఘునాథపాలెం: మండల పరిధిలోని కోటపాడు గ్రామ అంగన్‌వాడీ కేంద్రంలో గురువారం సన్‌రైజ్ అభ్యుదయ సేవా సమితి ఆధ్వర్యంలో గర్భిణులు, బాలింతల కోసం అవసరమైన వస్తువులు పంపిణీ చేశారు. సమితి ఉపాధ్యక్షుడు ఏనుగు శివ రాఘవ తల్లి జయంతి సందర్భంగా కుర్చీలు, బేబీ చైర్స్, వాటర్ క్యాన్స్ తదితర సామగ్రిని అందజేశారు. సమితి వ్యవస్థాపక అధ్యక్షులు మాలతీ దాస్, బీజేపీ జిల్లా కార్యవర్గ సభ్యులు ఏనుగు సుమన్‌బాబు, సమితి ప్రతినిధులు సుభాని, రామకృష్ణ, సిబ్బంది పాల్గొన్నారు.

సీఎంఆర్‌ఎఫ్ చెక్కు..

రఘునాథపాలెం: మండలపరిధిలోని పుటానితండా పంచాయతీలో గురువారం సీఎంరిలీఫ్ ఫండ్ నుంచి మంజూరైన ఆర్థికసాయాన్ని లబ్ధిదారులకు పంపిణీ చేశారు. ఈ సందర్భంగా సీపీఎం ఖమ్మం డివిజన్ కార్యదర్శి వై.విక్రమ్, ఆవాజ్ రాష్ట్ర కమిటీ సభ్యులు ఎం ఏ. జబ్బర్, సీపీఎం మండల కార్యదర్శి ఎస్.నవీన్ రెడ్డి చెక్కులు అందజేశారు. ఈ కార్యక్రమంలో నాయకులు గుగులోతు హరి, బానోతు నాగేశ్వరరావు, కుమార్, భూక్య సక్కుబాయి, వీరయ్య, ఆకారపు కృష్ణ, ఆకారపు సునీత, బానోతు సక్రు, భూక్య కమల్ పాల్గొన్నారు.

సేవా కార్యక్రమాలు



చొక్కాలు పంపిణీ చేస్తున్న నాయకులు

ఖమ్మంవన్‌టౌన్: ఖమ్మం ఎంపీగా రామసహాయం రఘురాంరెడ్డి ఏడాది కాలం పూర్తి చేసుకున్న సందర్భంగా ఎంపీ అభిమానులు, కాంగ్రెస్ పార్టీ శ్రేణుల ఆధ్వర్యంలో గురువారం ఎంపీ కార్యాలయంలో ఘనంగా వేడుకలు నిర్వహించారు. ఈ సందర్భంగా డీసీసీ అధ్యక్షుడు పువ్వాళ్ల దుర్గాప్రసాద్, మేయర్ పునుకొల్లు నీరజ, రాయల నాగేశ్వరరావు, మద్దినేని స్వర్ణకుమారి దయాకర్‌రెడ్డి, కొప్పుల చంద్రశేఖర్ కేక్ కట్ చేశారు. అనంతరం 50 మందికిపైగా తలసేమియా వ్యాధిగ్రస్త చిన్నారులకు రక్తదానం చేశారు. అనంతరం ఐఎన్‌టీయూసీ ఆధ్వర్యంలో ఆటోడ్రైవర్లకు ఖాకీ చొక్కాలు పంపిణీ చేశారు. ఈ కార్యక్రమాల్లో మహిళా కాంగ్రెస్ అధ్యక్షురాలు దొబ్బల సౌజన్య, మానుకొండ రాధాకిషోర్, లింగాల రవికుమార్, డాక్టర్ కోటా రాంబాబు నాయకులు తదితరులు పాల్గొన్నారు.

నేడు భవనాల అప్పగింత

నేలకొండపల్లి: మండల కేంద్రంలోని మోడల్ డిగ్రీ కాలేజీకి నిర్మించిన భవనాలను శుక్రవారం సాంఘీక సంక్షేమ అధికారులకు అప్పగించనున్నారు. మండలకేంద్రంలో మోడల్ డిగ్రీ కాలేజీ భవనాలకు రూ.14 కోట్లతో విద్యార్థులకు వేర్వేరుగా వసతి గృహాలను అత్యాధునిక నిర్మించారు. దీంతో భవనాలను సోషల్ వెల్ఫేర్ శాఖ అధికారులకు అప్పగించాలని రాష్ట్ర విద్యా శాఖ కమిషనర్ ఆదేశాలు జారీ చేశారు. ఈ మేరకు శుక్రవారం సోషల్ వెల్ఫేర్ డిప్యూటీ డైరెక్టర్ కస్తాల సత్యనారాయణకు అప్పగించనున్నారు.

ప్రకృతి వైపరీత్యాలపై అప్రమత్తంగా ఉండాలి

నేలకొండపల్లి: ప్రకృతి వైపరీత్యాలపై అప్రమతంగా ఉండాలని మండల స్పెషల్ ఆఫీసర్ రవిబాబు సూచించారు. స్థానిక రైతువేదికలో గురువారం అధికారులకు అవగాహన సదస్సు నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడారు... గ్రామ స్థాయిలో ఎలాంటి ప్రమాదాలు జరగకుండా తగిన ఏర్పాట్లు చేయాలన్నారు. ఎంపీడీఓ యం.యర్రయ్య, ఎంఈఓ బీ.చలపతిరావు, మండల పంచాయతీ అధికారి శివ పాల్గొన్నారు.

వందరోజుల ప్రణాళిక ర్యాలీ

ఖమ్మంరూరల్: ఏదులాపురం మున్సిపాలిటీ పరిధిలోని ఏదులాపురంలో వందరోజుల ప్రత్యేక ప్రణాళికలో భాగంగా గురువారం మున్సిపల్ అధికారులు, సిబ్బంది ర్యాలీ నిర్వహించారు. ఈ సందర్భంగా వార్డులో మొక్కలు నాటారు. గ్రామ కార్యదర్శి శ్రీధర్, ఆశావర్కర్లు, మున్సిపల్ సిబ్బంది పాల్గొన్నారు.

నివాళి

కామేపల్లి: మండలపరిధిలోని తాళ్లగూడెం గ్రామానికి చెందిన సీపీఐ నాయకులు యరగడ్ల బాబు ఇటీవల మృతి చెందగా ఆయన దశదిన కార్యక్రమానికి మాజీ మంత్రి పువ్వాడ అజయ్‌కుమార్, డీసీసీబీ మాజీ చైర్మన్ కూరాకుల నాగభూషణం హాజరై బాబు చిత్రపటానికి పూలమాలలు వేసి నివాళులర్పించారు. డీసీసీబీ డైరెక్టర్ మేకల మల్లిబాబు యాదవ్, నాయకులు పుచ్చకాయల వెంకటేశ్వర్లు, ఉదయ్‌కిరణ్ తదితరులు ఉన్నారు.

అభివృద్ధిపైనే జిల్లా మంత్రుల దృష్టి



బియ్యం పంపిణీ చేస్తున్న రాయల నాగేశ్వరరావు

నేలకొండపల్లి: ఉమ్మడి జిల్లాలో అభివృద్ధిని పరుగులు పెట్టించేందుకు జిల్లా మంత్రులు భట్టి విక్రమార్క, పొంగులేటి శ్రీనివాసరెడ్డి, తుమ్మల నాగేశ్వరరావులు ప్రత్యేక దృష్టి సారించారని రాష్ట్ర గిడ్డంగుల సంస్థ చైర్మన్ రాయల నాగేశ్వరరావు అన్నారు. ఈ మేరకు మండలంలోని రాజేశ్వరపురంలో గురువారం రేషన్ దుకాణాన్ని తనిఖీ చేసి పేదలకు పంపిణీ చేస్తున్న సన్న బియ్యంను పరిశీలించి లబ్ధిదారులతో మాట్లాడారు. కాంగ్రెస్ ప్రభుత్వం ఏర్పడిన తర్వాత అనేక సంక్షేమ పథకాలు ప్రవేశపెట్టిందని, పేదలకు కావాల్సిన ఇళ్లు, ఆహారం ప్రభుత్వం అందించేందుకు చర్యలు తీసుకుంటున్నట్లు తెలిపారు. ఎన్నికల సమయంలో ఇచ్చిన హామీలన్ని ప్రభుత్వం ఒక్కొక్కటిగా అమలు చేస్తుందని, ధనవంతులు మాదిరిగానే పేదలు తినాలని సన్నబియ్యం అందిస్తుందన్నారు. ఈ కార్యక్రమంలో డీసీసీ అధ్యక్షుడు పువ్వాళ్ల దుర్గాప్రసాద్, యూత్ కాంగ్రెస్ రాష్ట్ర కార్యదర్శి జెర్రిపోతుల అంజిని, బచ్చలకూరి నాగరాజు, బొందయ్య, యడవల్లి నాగరాజు, కడియాల నరేష్, బచ్చలకూరి వంశీ నాయకులు తదితరులు పాల్గొన్నారు.

డిగ్రీలో అడ్మిషన్లకు దరఖాస్తుల ఆహ్వానం



మాట్లాడుతున్న శ్రీనివాస్‌శర్మ

ఖమ్మం రూరల్: మండలంలోని మద్దులపల్లి గ్రామంలోని సాంఘిక సంక్షేమ గురుకుల మహిళా డిగ్రీ కళాశాలలో 2025–26 విద్యా సంవత్సరానికిగాను బీఏ, బీకాం, బీఎస్సీ మొదటి సంవత్సరం డిగ్రీ కోర్సుల్లో (ఇంగ్లీష్ మీడియం) ప్రవేశాలకు అర్హత కలిగిన మహిళా అభ్యర్థుల నుంచి దరఖాస్తులను ఆహ్వానిస్తున్నట్లు ప్రిన్సిపాల్ డాక్టర్ కె.శ్రీనివాస్‌శర్మ తెలిపారు. ఈ మేరకు గురువారం మాట్లాడుతూ.. గ్రామీణ ప్రాంత అభ్యర్థుల తల్లిదండ్రుల వార్షిక ఆదాయం రూ.1,50,000, పట్టణ ప్రాంత అభ్యర్థుల వార్షిక ఆదాయం రూ.2,00,000 మించకుండా ఉండాలన్నారు. దరఖాస్తునకు పదో తరగతి, ఇంటర్ మార్కుల మెమోలు, ఆదాయ, కులధ్రువీకరణపత్రాలు, ఐదు పాస్‌పోర్ట్ ఫోటోలు జతపరిచి ఈనెల 23 లోగా కళాశాలలో అందజేయాలన్నారు. అడ్మిషన్లు పూర్తిగా మెరిట్ ప్రాతిపదికన, రూల్ ఆఫ్ రిజర్వేషన్‌ను అనుసరించి ఇస్తామన్నారు. గురుకుల విద్యాసంస్థలు నాణ్యమైన విద్యనందిస్తున్నాయని, అడ్మిషన్ పొందిన విద్యార్థికి ఉచిత వసతి, పుస్తకాలు, స్టేషనరీ, దుస్తులు అందిస్తామన్నారు.

ఫీజుల నియంత్రణ చట్టాన్ని అమలుచేయాలి



వినతిపత్రం అందజేస్తున్న నాయకులు

ఖమ్మం మామిళ్లగూడెం: ఫీజుల నియంత్రణ చట్టాన్ని అమలుచేయాలని ఏఐఎస్‌ఎఫ్ జిల్లా అధ్యక్షుడు మదుపల్లి లక్ష్మణ్ ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు. ఈ మేరకు గురువారం ఏఐఎస్‌ఎఫ్ ఖమ్మం జిల్లా సమితి ఆధ్వర్యంలో జిల్లా విద్యాశాఖ సూపరింటెండెంట్‌కు వినతిపత్రం అందజేశారు. ఈ సందర్భంగా లక్ష్మణ్ మాట్లాడుతూ... జిల్లా వ్యాప్తంగా ఉన్న ప్రైవేట్ కార్పొరేట్ విద్యాసంస్థల యాజమాన్యాలు అనుమతి లేకపోయినా అడ్మిషన్లు చేస్తూ కోట్ల రూపాయలను దండుకుంటున్నాయన్నారు. జిల్లా వ్యాప్తంగా ఉన్న ప్రభుత్వ పాఠశాలలో చదువుతున్న విద్యార్థులకు సదుపాయాలు కల్పించి విద్యార్థుల సంఖ్యకనుగుణంగా మరుగుదొడ్లు, మూత్రశాలలు, పాఠ్య పుస్తకాలు, శిథిలావస్థకు చేరుకున్న భవనాల స్థానంలో కొత్త భవనాలు నిర్మించాలన్నారు. జిల్లా సహాయ కార్యదర్శులు షేక్ నాగుల మీరా, శివ నాయక్, గౌతమ్ తదితరులు పాల్గొన్నారు.

అటు శంకుస్థాపన..



శంకుస్థాపన చేస్తున్న అధికారులు, నాయకులు

కామేపల్లి: రాష్ట్ర ప్రభుత్వం ప్రతిష్టాత్మకంగా ప్రవేశపెట్టిన ఇందిరమ్మ ఇళ్ల నిర్మాణాలకు మండలంలోని మద్దులపల్లి గ్రామంలో గురువారం శంకుస్థాపన చేశారు. ఈ సందర్భంగా కాంగ్రెస్ మండల అధ్యక్షుడు గింజల నరసింహారెడ్డి మాట్లాడారు. ఈ కార్యక్రమంలో ఎంపీడీఓ రవీందర్, నాయకులు నల్లమోతు లక్ష్మయ్య తదితరులు పాల్గొన్నారు.

ఇటు పట్టాల పంపిణీ..

తిరుమలాయపాలెం: మండలంలోని ఏలువారిగూడెంలో ఇందిరమ్మ లబ్ధిదారులకు ఇళ్ల పట్టాలు పంపిణీ చేశారు. ఈ సందర్భంగా పట్టాలను ఎంపీడీఓ సిలార్‌సాహెబ్ పంపిణీ చేశారు. అనంతరం ఇందిరమ్మ గృహసముదాయ ప్రాంతంలో మొక్కలు నాటారు. వ్యవసాయ మార్కెట్ కమిటీ డైరెక్టర్ నంద్యాల శ్యాంసుందర్ రెడ్డి, మద్దికుంట్ల రాంరెడ్డి, కోసూరి శేఖర్, ఈలపొంగు వెంకన్న పాల్గొన్నారు.



పట్టాలు అందజేస్తున్న ఎంపీడీఓ సిలార్‌సాహెబ్

డ్రైవర్ల సంఘానికి ఎన్నికలు నిర్వహిస్తాం



మాట్లాడుతున్న జహంగీర్‌అలీ

ఖమ్మంసహకారనగర్: ప్రతీ జిల్లాలో డ్రైవర్ల సంఘం ఎన్నికలు నిర్వహిస్తామని రాష్ట్ర డ్రైవర్ల సంఘం అధ్యక్షుడు ఎండి.జహంగీర్‌అలీ అన్నారు. ఇటీవల నిర్వహించిన రాష్ట్ర డ్రైవర్ల సంఘం ఎన్నికల్లో జహంగీర్ అలీ ఏకగ్రీవంగా అధ్యక్షుడిగా ఎన్నికయ్యారు. ఈ సందర్భంగా గురువారం ఖమ్మంలో సన్మానించి అనంతరం ఆయన మాట్లాడుతూ.. గతంలో కొన్ని జిల్లాలో జరిగిన అవకతవకలను జరిగాయని, వాటిని సరిచేస్తామన్నారు. సంఘం జిల్లా అధ్యక్షులు కె వెంకటేశ్వర్లు, హౌస్ బిల్డింగ్ సొసైటీ చైర్మన్ సలీం, జిల్లా ప్రధాన కార్యదర్శి వేణు దాసరి, జిల్లా వైస్ ప్రెసిడెంట్ లింగంపల్లి గంగన్న, గౌరవ అధ్యక్షులు నాగరాజు, టౌన్ అధ్యక్షుడు కె.శ్రీనివాస్‌రెడ్డి, జిల్లా ప్రచార కార్యదర్శి సుధాకర్, కార్యవర్గ సభ్యులు ఉన్నారు.

ఉపాధ్యాయుల నుంచి దరఖాస్తుల ఆహ్వానం

ఖమ్మంక్రైం: జిల్లా పోలీస్ శాఖ ఆధ్వర్యాన కొనసాగుతున్న శ్రీకృష్ణ ప్రసాద్ మెమోరియల్ ఉన్నత పాఠశాలలో బోధించేందుకు ఉపాధ్యాయుల నుంచి దరఖాస్తులు ఆహ్వానిస్తున్నట్లు పాఠశాల చైర్‌పర్సన్ నిష్ఠాశర్మ తెలిపారు. హైస్కూల్ తరగతులకు హిందీ, సోషల్, సంగీతం, గాత్రం, వాయిద్య పరికరాలు బోధించేందుకు డిగ్రీ లేదా పీజీతో బీఈడీ కలిగిన వారు అర్హులని వెల్లడించారు. ఆసక్తి ఉన్న వారు ఈనెల 12 లోగా kphskmm@gmail.com మెయిల్‌కు దరఖాస్తులు పంపించాలని, వివరాలకు 9440525093 నంబర్‌ను సంప్రదించాలని సూచించారు.

బాబా మందిరంలో పూజలు



పూజలు చేస్తున్న భక్తులు

ఖమ్మంగాంధీచౌక్: నగరంలోని బైపాస్‌రోడ్డు విజయ్‌నగర్ కాలనీలో ఉన్న షిర్డీ సాయిబాబా మందిరం 18వ వార్షికోత్సవం సందర్భంగా గురువారం ప్రత్యేక పూజలు, మహా అన్నదానం నిర్వహించారు. మందిర చైర్మన్ ఫణిభట్ల రాజలింగయ్య, కార్పొరేటర్ రోహిణి సత్యనారాయణ, మచ్చ నరేందర్, బాగం హేమంతరావు, బీరెడ్డి నాగచంద్రారెడ్డి, మందిర ప్రతినిధులు పెంట్యాల వెంకటనర్సయ్య, చంద్ర వీరభద్రరావు, అప్పారావు, మండెపూడి కృష్ణయ్య, దొడ్డా నర్సింహారావు, భూక్యా భిక్షపతి తదితరులు పాల్గొన్నారు.

రైతులను బలితీసుకుంటున్న కాంగ్రెస్

- మాజీ మంత్రి పువ్వాడ



నివాళులర్పిస్తున్న పువ్వాడ, తదితరులు

రఘునాథపాలెం: రాష్ట్ర ప్రభుత్వం ఎన్నికల్లో ఇచ్చిన హామీలన్నీ అర్ధాంతరంగా నిలిచిపోయాయని, కాంగ్రెస్ రైతులను మోసం చేసి బలి తీసుకుంటుందని మాజీ మంత్రి బీఆర్‌ఎస్ నేత పువ్వాడ అజయ్‌కుమార్ విమర్శించారు.మండల పరిధిలోని చిమ్మపూడి గ్రామానికి చెందిన పరిమిశెట్టి శెట్టి వీరబాబు అనే రైతు అప్పుల బాధతో ఆత్మహత్య చేసుకున్న రైతు ఇంటికి వెళ్లి వీరబాబు చిత్రపటానికి పూలమాల వేసి నివాళులర్పించి కుటుంబాన్ని పరామర్శించారు. బాధిత కుటుంబానికి రూ.10 వేల ఆర్థిక సాయాన్ని అందజేశారు. ఈ సందర్భంగా పువ్వాడ అజయ్ కుమార్ మాట్లాడుతూ.. రైతు రుణమాఫీ, బీమా, భరోసా పేర్లతో మాటలు చెప్పి అమలుచేయకపోవడంతో ఈ విషాద ఘటనలు జరుగుతున్నాయని విమర్శించారు. ఇప్పటికైనా ప్రభుత్వం స్పందించి రైతు కుటుంబాలను ఆదుకోవాలని డిమాండ్ చేశారు. మాజీ వైస్ ఎంపీపీ గుత్తా రవి, మాజీ ఆత్మ కమిటీ చైర్మన్ భూక్యా లక్షణ్ నాయక్, మాజీ రైతు సమన్వయ సమితి అధ్యక్షుడు దొంతు సత్యనారాయణ, కార్పొరేటర్ నాగండ్ల కోటేశ్వరరావు, మోతరపు సుధాకర్, గొర్రి శ్రీనివాసరావు, వెంకట్ రెడ్డి, విజయ్, జానీ పాల్గొన్నారు.

నిబంధనల మేరకు విత్తనాలు అమ్మాలి



రైతులతో మాట్లాడుతున్న అధికారులు

కూసుమంచి: కూసుమంచిలోని పలు విత్తన దుకాణాలను గురువారం కూసుమంచి ఏడీఏ సరిత, ఏఓ వాణి, అదనపు ఎస్సై దివ్యశ్రీతో కలిసి తనిఖీ చేశారు. డీలర్లు విత్తన చట్టానికి లోబడి విత్తనాలను విక్రయించాలని, లేకుంటే కఠిన చర్యలు తప్పవని హెచ్చరించారు. విత్తనాలు కొనుగోలు చేసిన రైతులకు తప్పనిసరిగా బిల్లులను ఇవ్వాలని, ఆ బిల్లుల్లో రైతుల సంతకాలు తీసుకోవాలన్నారు. ఎక్కడైనా బీటీ- 3 విత్తనాలను విక్రయించినట్టయితే రైతులు వ్యవసాయశాఖ అధికారులకు గానీ, స్థానిక పోలీస్‌స్టేషన్‌కు గానీ సమాచారం అందించాలన్నారు. కొనుగోలు చేసిన విత్తన ప్యాకెట్లను పంట పూర్తయ్యే వరకు భద్రపర్చుకోవాలన్నారు.

భూ భారతితో భూ సమస్యలు పరిష్కారం



వినతిపత్రం అందుకుంటున్న అధికారులు



కామేపల్లిలో..

ఖమ్మంఅర్బన్, రఘునాథపాలెం: రాష్ట్ర ప్రభుత్వం ప్రవేశపెట్టిన భూ భారతితో రైతుల భూ సమస్యల పరిష్కారానికి ఉపయోగకరంగా ఉంటుందని, రైతుల సమస్యలను గ్రామ సభల్లో వినతిపత్రాలు అందించి పరిష్కరించుకోవాలని ఆర్డీఓ నరసింహారావు సూచించారు. ఈ మేరకు గురువారం చట్టంపై అవగాహన కల్పించే కార్యక్రమంలో మండలంలోని మంచుకొండ, రేగులచలక, నగరంలోని 1వ డివిజన్ కైకొండాయిగూడెం గ్రామాల్లో నిర్వహించిన గ్రామసభలో పాల్గొని మాట్లాడారు. ఈ మేరకు మంచుకొండలో జరిగిన సభలో 76 దరఖాస్తులు, రేగులచలకలో 58, కైకొండాయిగూడెం 191 మంది రైతులు వినతిపత్రాలు అందించారు. తహసీల్దార్లు సైదులు, శ్వేత, డీటీ మురళీధర్, వెంకటేశ్వర్లు, ఆర్ఐ ప్రవీణ్, సత్యనారాయణ, వాహిద్, కార్పొరేటర్ హుస్సేన్, కాంగ్రెస్ మండల కన్వీనర్ వాంకుడోత్ దీపక్ నాయక్, రైతుసంఘం అధ్యక్షుడు భూక్య భద్రునాయక్, నాయకులు బానోత్ ఉపేందర్ నాయక్, సిబ్బంది, రైతులు పాల్గొన్నారు.

కామేపల్లి: మండలంలోని జోగ్గూడెం, రుక్కితండాలో భూ భారతి రెవెన్యూ సదస్సులు ఆయా గ్రామాల్లో ప్రశాంతంగా కొనసాగుతున్నాయని తహసీల్దార్ సుధాకర్ తెలిపారు. ఆర్ఐ సక్రు, రెవెన్యూ సిబ్బంది పాల్గొన్నారు.

పరిశ్రమలు ఏర్పాటుచేసి ఉపాధి కల్పించాలి

తిరుమలాయపాలెం: జిల్లాలో మినీ పరిశ్రమలు ఏర్పాటు చేసి నిరుద్యోగ యువతకు ఉద్యోగ అవకాశాలు కల్పించాలని డీవైఎఫ్ఐ జిల్లా కార్యదర్శి షేక్ బషీరుద్దీన్ ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు. యువ చైతన్య సైకిల్ యాత్ర గురువారం మండల కేంద్రానికి చేరుకున్న సందర్భంగా నాయకులు స్వాగతం పలికారు. ఈ సందర్భంగా అంబేడ్కర్ విగ్రహానికి పూల మాలలు వేసి నివాళులర్పించారు. దేశంలో నిరుద్యోగం పెరిగిపోతుందని ఎక్కడికక్కడ పరిశ్రమలు ఏర్పాటు చేసి నిరుద్యోగ యువతను ఆదుకోవాలన్నారు. జిల్లా అధ్యక్షుడు మద్దాల ప్రభాకర్, రాష్ట్ర కమిటీ సభ్యులు చింతల రమేష్, శీలం వీరబాబు, యాత్ర మేనేజర్, సత్తెనపల్లి నరేష్, జిల్లా ఉపాధ్యక్షుడు గుమ్మ ముత్తారావు, బొడ్డు మధు, గడ్డం విజయ్, రావులపాటి నాగరాజు, ఎలిజాల గోపీనాథ్, కురెల్లి రాకేష్, ధీరజ్, మండల అధ్యక్షుడు దిండు మంగపతి, మాచర్ల రాజశేఖర్, నెరుసుల వెంకటేశ్వర్లు వర్షపొంగ వీరన్న, కొమ్ము నాగేశ్వరరావు, సైజులు, దొడ్డ లింగస్వామి, దాసరి మహేందర్ తదితరులు పాల్గొన్నారు.

ఈనెల 18న ర్యాలీ

నేలకొండపల్లి: దేశ రక్షణకు పాకిస్తాన్ ఉగ్రవాదులను తరిమికొట్టిన త్రివిధ దళాలకు దివ్యాంగులు సెల్యూట్ చేస్తున్నామని, ఈ మేరకు ఈ నెల 18న నేలకొండపల్లి లో మహార్యాలీ నిర్వహిస్తున్నామని తెలంగాణ దివ్యాంగుల జేఏసీ చైర్మన్ పీవీ.చలమయ్య అన్నారు. మండల కేంద్రంలో గురువారం జేఏసీ సమావేశాన్ని నిర్వహించారు. తొలుత వీర జవాన్లకు సంతాపాన్ని ప్రకటించారు. ఈ సమావేశంలో జేఏసీ నాయకులు రామకృష్ణ, వెంకటేశ్వర్లు, తిరపమ్మ, భిక్షం, శ్రీను, గోపి, రాజ్‌స్వామి, నాగరాజు, పుల్లయ్య, రాము, కె.వీరన్న, రఫీ, అనిత, రాధా, గురవయ్య తదితరులు పాల్గొన్నారు.

భూ భారతి మరో ధరణి కావొద్దు

తిరుమలాయపాలెం: భూభారతి చట్టం అధికార పార్టీ నాయకులకు చుట్టం కాకూడదని, భూ భారతి మరో ధరణి కాకుండా చూడాలని సీపీఐఎంఎల్ మాస్‌లైన్ నాయకులు కమ్మ కోమటి నాగేశ్వరరావు అన్నారు. ఈ మేరకు గురువారం మండలంలోని పిండిప్రోలులో జరిగిన సమావేశంలో మాట్లాడారు. నిజమైన భూమి ఉన్న రైతులకు న్యాయం చేసే విధంగా భూభారతి చట్టం ఉండాలన్నారు. నాయకులు తిమ్మిడి హన్మంతరావు, మండల కార్యదర్శి సోమపల్లి వెంకటేశ్వర్లు, వెంకన్న ఉన్నారు.

పదవీ విరమణ పొందిన వారికి అవకాశం కల్పించాలి

ఖమ్మంసహకారనగర్: ఉద్యోగ, ఉపాధ్యాయుల పదవీ విరమణ వయసు పెంపు విషయంలో 2024 మార్చి నుంచి విరమణ పొందిన వారిలో అర్హులను గుర్తించి మరోసారి అవకాశం కల్పించాలని ఉద్యోగ, ఉపాధ్యాయుల జాయింట్ యాక్షన్ కమిటీ అధ్యక్షులు సి.జయరాం, ప్రధాన కార్యదర్శులు అబ్రహం, మాధవరావు కోరారు. 1996, 1998, 2000 ఏడాదిల్లో డీఎస్సీలో ఎంపికైన ఉపాధ్యాయులు కనీస సర్వీస్ పూర్తిచేయకుండానే పదవీ విరమణ పొందారని, వారికి అవకాశం కల్పించాలని కోరారు.

ఘనంగా ప్రపంచ పర్యావరణ దినోత్సవం

ఖమ్మంమయూరిసెంటర్: ప్రపంచ పర్యావరణ దినోత్సవం సందర్భంగా గురువారం ఖమ్మం నగర పాలక సంస్థ పరిధిలో పచ్చదనం కార్యక్రమాన్ని ప్రారంభించారు. ఈ సందర్భంగా దానవాయిగూడెం డంపింగ్ యార్డ్ వద్ద భారీ మొక్కలు నాటే కార్యక్రమాన్ని నిర్వహించారు. మేయర్ పునుకోలు నీరజ, మున్సిపల్ కమిషనర్ అభిషేక్ ఆగస్త్య, ఉద్యాన అధికారి రాధిక, పర్యావరణ ఇంజినీర్, టీఎంసీ సుజాత, డీఎంసీ సుజాత, శానిటేషన్ సూపర్‌వైజర్ సంబయ్య, గార్డెన్స్ సిబ్బంది, మెప్మా సభ్యులు, శానిటేషన్ కార్మికులు పాల్గొన్నారు.

రఘునాథపాలెం: ప్రపంచ పర్యావరణ దినోత్సవం సందర్భంగా మండలంలోని వీవీపాలెం పంచాయతీలో జీపీ కార్యాలయం వద్ద మొక్కలు నాటారు. హెల్త్ సూపర్‌వైజర్ తాళ్లూరి శ్రీకాంత్, పంచాయతీ కార్యదర్శి బి.కృష్ణ, ఏఎన్ఎం మేడ పుష్పవతి, యల్.హెచ్.పి మౌనిక, హెల్త్ అసిస్టెంట్ కృష్ణయ్య, ఫీల్డ్ అసిస్టెంట్ శారద, తదితరులు పాల్గొన్నారు.

నేలకొండపల్లి: పర్యావరణ పరిరక్షణ ప్రతీ ఒక్కరి బాధ్యతని ప్రభుత్వ డిగ్రీ కాలేజీ ప్రిన్సిపాల్ డాక్టర్ ఆలేటి పరంజ్యోతి అన్నారు. ఈ మేరకు ఎన్ఎస్ఎస్ ఆధ్వర్యంలో మొక్కలు నాటారు. ఎన్ఎస్ఎస్ కోఆర్డినేటర్ డాక్టర్.ఎన్.శ్రీనివాసరావు, కాలేజీ వైస్ ప్రిన్సిపాల్ డాక్టర్ బి.వెంకటేశ్వరరెడ్డి, ఎస్.రమేష్, అధ్యాపకులు, సిబ్బంది పాల్గొన్నారు.



ఖమ్మంమయూరిసెంటర్: మొక్క నాటుతున్న మేయర్, కమిషనర్ తదితరులు



రఘునాథపాలెంలో..



నేలకొండపల్లిలో..